ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

- రెండు సెషన్స్‌లో 174 మంది అభ్యర్థులు గైర్హాజరు
- పరీక్షలు ప్రశాంతం : డీఈవో జనార్దన్‌రెడ్డి



పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఏపీ మెగా డీఎస్సీ పరీక్షలు ఐదు పరీక్షా కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్కూల్ అసిస్టెంట్ టీజీటీ(నాన్ లాంగ్వేజి) అభ్యర్థులకు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల మొదటి సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 799 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 712 మంది అభ్యర్థులు హాజరై 87 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో 790మంది అభ్యర్థులకు గాను 703మంది అభ్యర్థులు హాజరుకాగా 87 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో జనార్దన్ రెడ్డి తెలిపారు.

డీఎస్సీ కేంద్రాల పరిశీలన

పాణ్యం: మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న డీఎస్సీ పరీక్షా కేంద్రాలను నంద్యాల డీఈవో జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ మంద జావలి పరిశీలించారు. శుక్రవారం వారు కేంద్రాల వద్ద అభ్యర్థులకు సౌకర్యాల ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవోలు శంకరప్రసాద్, వెంకట్రామిరెడ్డి, ఎంఈవో రామసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అభ్యర్థుల హాల్‌టిక్కెట్ల పరిశీలన

సైబర్‌గాళ్లు



సెల్‌ఫోన్‌తో ప్రతి వస్తువు ఆన్‌లైన్‌లో కొనే వెసులుబాటు వచ్చింది. ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి గృహోపకరణాలు, సెల్‌ఫోన్లు, దుస్తులు, ఖరీదైన వస్తువులు తక్కువ ధరకే ఇస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. ఆర్డర్ పెట్టాక నాసిరకం వస్తువులు, ఇటుకలు, చెక్కలు, ఖాళీ బాక్సులు డెలివరీ చేస్తున్నారు. పెద్ద పెద్ద ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ల్లో సైతం మోసం జరుగుతోంది. దీంతో ఆన్‌లైన్ షాపింగ్ అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా దీన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక చాలా మంది భయపడుతున్నారు. కనీసం ఫిర్యాదు కూడా చేయలేకపోతున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...



- ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న వైనం
- రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు
- నకిలీ వెబ్‌సైట్లతో అక్రమాలు
- లబోదిబోమంటున్న ప్రజలు
- బాధితుల్లో విద్యాధికులు, ఉద్యోగులు
- అవగాహన కల్పిస్తున్న సైబర్ పోలీసులు

నంద్యాల టౌన్, జూన్6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారు. నంద్యాల జిల్లాలో 2024 జనవరి నుంచి 2025 ఇప్పటి వరకు కేవలం 29 కేసులు మాత్రమే నమోదు చేశారు. ఇలా చాలా మంది మోసపోతున్నా.. సైబర్ నేరగాళ్ల గురించి ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. ఆన్‌లైన్ పేమెంట్ చేసే సమయంలో ఎవరికి, ఏ ప్రాంతంలో చేస్తున్నాం అన్నది గమనించాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా మోసపోయిన వారిలో విద్యాధికులు సైతం ఉండడం విశేషం. ఆధునిక సాంకేతికత అనేక సౌకర్యాలను అందిస్తున్న మాట నిజమే. కానీ దాని దాపునే అనేక మోసాలు జరుగుతున్నాయి.

ఆఫర్లకు ఆకర్షితులై..

బ్రాండెడ్ వస్తువులు, సగం ధరలకే వస్తున్నాయనే ఆఫర్లకు ఆకర్షితులై వెబ్‌సైట్లో వచ్చిన లింకులు ద్వారా తమకు కావాల్సిన వస్తువులను ముందు వెనుక చూడకుండా కొందరు కొనుగోలు చేస్తున్నారు. డబ్బులు చేతులు మరాక వెబ్‌సైట్‌లు మాయం అవుతున్నాయి. క్యాష్ ఆన్ డెలివరీ, రిటర్న్ ఆప్షన్ ఉంటేనే కొనుగోలు చేయాలని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది ఆన్‌లైన్ ద్వారా, కొన్ని నెంబర్ల నుంచి ఫోన్‌చేసి మాట్లాడి మోసం చేయడంతో వారి ఆకౌంటులోని డబ్బులు మాయం అయ్యాయి. అయినా ఎవరికీ చెప్పుకోలేక, అవగాహన లేక ఫిర్యాదులు చేయడం లేదు. ఇదిలా ఉంటే చాలా యువత, విద్యార్థులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడి అకౌంటు ద్వారా లావాదేవీలు చేయడంతో డబ్బులు మాయం అవుతున్నాయి. ఇదంతా తెలిసినా ఫిర్యాదు చేయలేక ఆస్తులు అమ్మి, చెల్లించినవాళ్లు ఉన్నారు.

ఫిర్యాదు చేయనివి..

- నంద్యాల పట్టణానికి చెందిన ఒక వ్యాపారికి అర్ధరాత్రి ఆగకుండా సుమారుగా 20సార్లు ఫోన్ చేశారు. కానీ ఎత్తలేదు. కంటిన్యూగా చేస్తుంటే ఒక్కసారి ఫోన్ ఎత్తి హలో అనగానే అతని క్రెడిట్ కార్డు నుంచి ఏకంగా ఐఫోన్ కొనుగోలు చేసినట్లు సమాచారం వచ్చింది. కానీ చిరునామా చూడగా అందులో ముంబైలో ఉన్నట్లు చూపించింది. దీంతో చేసేదేమీలేక ఆ మొత్తాన్ని కట్టాడు. ఫిర్యాదు చేయలేదు.
- ఇటీవల నంద్యాల రైల్వే కానిస్టేబుల్ అకౌంటులో ఏకంగా రెండు నెలల వ్యవధిలో రూ.లక్ష మైనస్ పడింది. దీంతో బ్యాంకు వారిని అడగగా వారు హోల్డ్ చేశామన్నారు. ఇది ఎందుకు మైనస్ పడిందని చెప్పలేకపోతున్నారు. సైబర్ పోలీసులను అడగగా వారు ఇది బ్యాంకుకు సంబంధించినది అని చెప్పారని బాధితుడు తెలిపారు.
- నంద్యాలలోని పాత పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో ఐఫోన్ తక్కువకు ఆఫర్ ఉందని చూసి ఆర్డర్ చేశారు. డెలివరీ సమయంలో అందులో చెక్కముక్కలు ఉన్నాయి. చేసేదేమీ లేక డబ్బులు పోయాయని, అర్థమై కూడా ఫిర్యాదు చేయలేదు.



బాధితులు వీరే..

- నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలానికి చెందిన ఒక మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో పనిచేస్తున్నారు. 2024లో సంక్రాంతికి ఇంటికి వచ్చారు. తెలియని నెంబర్ నుంచి ఫోన్ చేసి మీకు ఆన్‌లైన్‌లో విమానం టిక్కెట్లు తక్కువ ధరకు వస్తున్నాయి. మీరు మళ్లీ ఎక్కువకు అమ్ముకోవచ్చని చెప్పారు. ఆమె వారు అడిగిన సమాచారం ఇచ్చింది. దీంతో ఆమె ఖాతా నుంచి ఏకంగా రూ.18లక్షలు తీసుకున్నారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న ఆమె వెంటనే నంద్యాల సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- శిరివెళ్లకు చెందిన ఒక ప్రైవేటు ఉద్యోగికి 2025 జనవరిలో గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్‌చేసి మీ ఆధార్ కార్డు మీద వేరే వాళ్ల సిమ్ తీసుకుని క్రైం చేశారని భయపెట్టారు. ఆయన అకౌంటు నుంచి ఏకంగా రూ.32లక్షలు తీసుకున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



చాలా వరకు ప్రజల్లో, విద్యార్థులకు ఎప్పటికప్పుడు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం. ఆన్‌లైన్ కొనుగోలు చేసే సమయంలో నిజ నిజాలు తెలుసుకోవాలి. అనుమానం వస్తే వెంటనే సైబర్ పోలీసులకు సమాచారమివ్వాలి.

● వంశీధర్ , సీఐ, సైబర్ క్రైం, నంద్యాల జిల్లా

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ స్టేషన్ల నుంచి ఆయా విభాగాల్లో విధులు నిర్వహించే పోలీసులు వారి బదిలీలు, మెడికల్ గ్రౌండ్స్ రిక్వెస్టు బదిలీలు, గురించి వచ్చారని వారి నుంచి వివరాలు తీసుకుని తగిన న్యాయం చేస్తామని చెప్పారు. ఈగ్రీవెన్స్‌లో ప్రత్యేకచర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ఇబ్బందులు పడకుండా వారి సమస్యలు తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ముస్తాబైన మసీదులు, ఈద్గాలు
- ఖుర్బానీ, ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- జోరుగా పొట్టేళ్లు, గొర్రెల అమ్మకాలు

రుద్రవరం, జూన్6(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండగకు ముస్లింలు శుక్రవారం ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ మాసంలో చంద్రోదయం ఆధారంగా 10వ రోజున శనివారం ఈద్ ఉల్ జహా (బక్రీద్) జరుపుతారు. అల్లా కోసం పూర్వప్రవక్త హజరత్ ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ ప్రాణాన్ని త్యాగం చేసేందుకు సిద్ధపడి దైవ పరీక్షలో నెగ్గిన సందర్భాన్ని పురస్కరించుకుని ముస్లింలు బక్రీద్‌ను త్యాగదినంగా నిర్వహిస్తారు.



ఇస్మాయిల్ నిస్సంకోచంగా అందుకు అంగీకరించి, ప్రాణత్యాగానికి సిద్ధమవుతారు. దైవానుగ్రహం కోసం కుమారుడిని సైతం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడిన ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగ నిరతిని, దైవంపై ఉన్న అచంచల విశ్వాసానికి అల్లా ప్రసన్నమవుతారు. కుమారుడిని ఖుర్బానీ ఇచ్చే సమయంలో స్వర్గం నుంచి ఓ గొర్రె(దుంబ)ను తెచ్చి ఆ ప్రదేశంలో ఉంచుతారు. దీంతో అల్లా ఆదేశం ప్రకారం ఖుర్బానీ సంపూర్ణమవుతుంది. ఈ చారిత్రక ఘటన నేపథ్యంలో మహా ప్రవక్త నిర్దేశం మేరకు బక్రీద్ పండగను జరుపుకోవడం ముస్లింలకు ఆచారంగా వస్తోంది.

ఈ సందర్భంగా ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేసి బంధుమిత్రులను కలిసి శుభాకాంక్షలు చెబుతారు. రంజాన్ సందర్భంగా దానాలు చేసే ముస్లింలు బక్రీద్ రోజున ఖుర్బానీ ఇస్తారు.

ఇదీ చరిత్ర: ప్రవక్త హజరత్ ఇబ్రహీం నిద్రిస్తున్న సమయంలో తన కుమారుడిని త్యాగం చేస్తున్నట్టు కల వస్తుంది. ఇలా మూడుసార్లు కల రావడంతో ఇదే విషయాన్ని తన కుమారుడు ఇస్మాయిల్‌కు చెబుతారు. దైవ విశ్వాస్ అయిన హజరత్



కొండమాయపల్లెలో ముస్తాబైన ఈద్గా

ఖుర్బానీ: బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఖుర్బానీ ఇచ్చిన జంతువు మాంసాన్ని మూడు భాగాలు చేస్తారు. ఓ భాగాన్ని పేదలకు, రెండో భాగాన్ని బంధుమిత్రులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. ఇందులో ఏమాత్రం వ్యత్యాసం రాకూడదు.

సందడి షురూ...: బక్రీద్ సందర్భంగా పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ కోసం ఇప్పటికే కొందరు పత్తికొండ, గూళ్యం, అరికెర, ఆదోని ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పొట్టేలు కొనుగోలు చేశారు. రూ.10 వేల నుంచి రూ.30 వరకు ధర పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. శనివారం జరిగే ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాలు సిద్ధం చేశారు.

నమాజ్‌లకు ఈద్గాలు, మసీదులు సిద్ధం

ఈద్ ఉల్ జహా (బక్రీద్) నమాజ్‌లకు ఈద్గాలు, మసీదులు సిద్ధం చేశారు. శుభ్రం చేసి శనివారం నమాజ్‌లు చేసేందుకు ఏర్పాట్లుచేశారు. రుద్రవరం, కొండమాయపల్లె, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, నరసాపురం, ఆలమూరు, మందలూరు గ్రామాలతో పాటు ఇంకా పలు గ్రామాల్లో సిద్ధం చేశారు. పలు చోట్ల ఈద్ నమాజు మసీదుల్లో సైతం జరుపుతారు. దీని కోసం మసీదులను సైతం సిద్ధం చేశారు.

అనుమతులు తప్పనిసరి : డీఎంహెచ్‌వో

నంద్యాల హాస్పిటల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలంటే వైద్య, ఆరోగ్యశాఖ అనుమతులు తప్పనిసరి అని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ కొత్త స్కానింగ్ సెంటర్లు జిల్లా కమిటీవద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి ఒక నెల ముందే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుతో పాటు రెన్యువల్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల నుంచే స్కానింగ్ మిషన్లు కొనుగోలు చేయాలన్నారు. చట్టవ్యతిరేకంగా పరీక్షలు చేసిన వైద్యులపై చర్యలు తప్పవన్నారు. లింగనిర్ధారణ నిషేధ చట్టంపై జిల్లాలో ఐసీడీఎస్, మహిళాసంఘాలు, పోలీసుల సహకారంతో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ జయరాం, మదర్‌హార్ సెల్ప్ సొసైటీ డాక్టర్ రాజశేఖర్, ఇన్‌చార్జి డెమో రవీంద్రనాయక్, వంశి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

షైనింగ్ స్టార్ అవార్డులకు
215 మంది విద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 215మంది విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారని డీఐఈవో శంకర్‌నాయక్, డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్ ఆదేశాల మేరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 180 మంది విద్యార్థులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన 35 మంది విద్యార్థులకు అవార్డులు అందజేస్తామన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని చాబోలు రోడ్‌లో ఉన్న ఏఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 9వ తేదీన అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్‌తో పాటు రూ.20వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామన్నారు.

ఆశల ఖరీఫ్..!

ఈ ఏడాది నైరుతి రుతిపవనాలు ముందుగానే రావడంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. అన్నదాతలు ఎంతో ఆశతో ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ యంత్రాంగం మేము సైతం అంటున్నారు. ఈ ఏడాది 4,22,540 హెక్టార్లు వివిధ పంటలు సాగు చేసే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అందులో అత్యధికంగా 2.34లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అంచనా. నాసిరకం విత్తనాలు, పెట్టుబడి సమస్య, ఎరువులు, పెరిగిన సేద్యం ఖర్చులు రైతులను వెంటాడుతున్నాయి. బ్యాంకుల్లో సర్దుబాటు (బుక్ అడ్జస్ట్‌మెంట్) రుణాలతో సరిపుచ్చుతున్నారు. దీంతో పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పు చేయక తప్పని పరిస్థితి. 2025-26 ఖరీఫ్ సాగుబడిపై 'ఆంధ్రజ్యోతి'ప్రత్యేక కథనం.



- మురిపించిన ముందస్తు రుతుపవనాలు
- సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు
- మృగశిర కార్తెలో విత్తనాలు వేసేలా ప్రణాళిక
- 4,22,540 హెక్టార్ల సాగు లక్ష్యం
- వేధిస్తున్న నాసిరకం విత్తనాలు
- పెట్టుబడి కోసం తప్పని తిప్పలు
- అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూపులు
- కౌలు రైతులకు రుణాలు అందేనా?
- పత్తి 2.34లక్షల హెక్టార్లలో సాగు చేయవచ్చని అంచనా

కర్నూలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల ఎంతో ఆశతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కర్నూలు జిల్లాలో ప్రధాన జీవనాధారం వ్యవసాయం. 2025-26 ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 4,22,540 హెక్టార్లు. గతేడాది పత్తికి ఆశాజనకంగా ధర ఉండడం, ఈ ఏడాది తెల్లబంగారం కనీస మద్దతు ధర రూ.8,110కు పెంచడంతో రైతులు 2.34 లక్షల హెక్టార్లతో సాగు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. చిరుధాన్యం పంటలు 2,679 హెక్టార్లు, ఆహార పంటలు 58,466 పప్పుదినుసులు 58,515, ఆయిల్ సీడ్స్ 64,633 హెక్టార్లు సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. పత్తి తరువాత కంది, వేరుశనగ, ఉల్లి, మిరప, ఆముదం పంటలు అధికంగా సాగు చేసే అవకాశం ఉంది. ముందస్తు వర్షాలు మురిపించడంతో అన్నదాతలు పొలాలు దుక్కులు దున్ని మృగశిర కార్తెలో వర్షాధారం పంట విత్తనాలు వేసేందుకు సన్నద్ధం చేస్తున్నారు.



ఎరువు.. బరువు: యూరియా 83,948 టన్నులు, కాంప్లెక్స్ 1,35,766 టన్నులు, డీఏపీ 26,847 టన్నులు, ఎస్ఎస్‌పీ 3,174, ఎంఓపీ (పొటాస్) 9,438, సిటీ కంపోస్టు 6,479 టన్నులు కలిపి 2,65,652 మెట్రిక్ టన్నులు రసాయన ఎరువులు అవసరమని అంచనా. ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 65 వేల మెట్రిక్ టన్నులే. కాంప్లెక్స్ ఎరువు బస్తాపై రూ.50-100 పెరగడంతో రైతులకు భారం తప్పడం లేదు.

వెంటాడుతున్న నాసిరకం విత్తనాలు

బీటీ-2 పత్తి విత్తనాలు 475 గ్రాములు (450 గ్రాములు బీటీ రకం, 25 గ్రాములు నాన్ బీటీ రకం) ప్యాకెట్ కనీస విక్రయ ధర (ఎంఆర్‌పీ) రూ.863 నుంచి రూ.901లకు పెంచారు. ఒక్కో ప్యాకెట్‌పైన రూ.38 పెరగడంతో ఉమ్మడి జిల్లా రైతులపై రూ.11.50 కోట్ల వరకు అదనపు భారం తప్పడం లేదు. మరో పక్క నాసిరకం విత్తనాలు సమస్య వెంటాడుతుంది. అధికారుల తనిఖీలు నామమాత్రంగానే ఉంది.

మిగతా 7వ పేజీలో

నేటి సమాజంలో ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు తపిస్తున్నారు. దీంతో మంచి పాఠశాలలో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎంత దూరమైనా పంపిస్తున్నారు. ఇలాంటి వేళ ప్రతి బడికి బస్సు తప్పని సరైంది. ఈ బస్సులు ఎంతవరకు భద్రమో తెలియదు. అయితే ప్రతి ఏడాది వీటికి ఎఫ్‌సీ(ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు) మాత్రం తప్పక తీసుకోవాల్సిందే. అయితే గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం నూతన విధానంలో ఎఫ్‌సీలు జారీ చేస్తున్నారు. దీనికి ప్రైవేటు ఏజెన్సీలకు బాధ్యతను అప్పగించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1400 పైగా స్కూల్స్, కళాశాలల బస్సులు ఉన్నాయి. వీటికి పరీక్షలను నిర్వహించేందుకు, ప్రతి దానికి ఏజెన్సీల వారు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో మాదిరిగా గడువు దాటినా నిదానంగా ఎఫ్‌సీలు చేయించుకుందామంటే ఇక కుదరదు. ఆలస్యమైతే సీజ్ చేస్తామని రవాణా శాఖాధికారులు చెబుతున్నారు.



ఫిట్ అధనం

కర్నూలు క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడి బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు ఓ సెంటర్‌లో డబ్బులను అదనంగా వసూలు చేస్తున్నారు. ఈఏడాది మాత్రం కొత్త విధానం అమలులోకి వచ్చింది. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలన్నీ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్‌సీ(ఫిట్‌నెస్ సర్టిఫికెట్) చేయించుకోవాలంటే సీటింగ్ కెపాసిటీ బట్టి ప్రతి బస్సు రూ.1500 నుంచి రూ.2వేలు చలానా ప్రభుత్వానికి చెల్లించాలి. ఇతరత్రా మరమ్మతులు, రేడియం స్టిక్కర్లు యాజమాన్యమే భరించాలి. ఉమ్మడి జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కర్నూలుకు చిన్నటేకూరు వద్ద, నంద్యాలకు చాబోలు వద్ద ఏర్పాటు చేశారు. వీటిలో ఓకేంద్రంలో ప్రతి స్కూల్ యాజమాన్యం నుంచి రూ.3వేలు నుంచి రూ.4వేలు దాకా అదనపు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ రవాణా శాఖ అధికారులు కూడా ఎవరూ ఉండకపోవడంతో ఏజెన్సీకి చెందిన కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. మరో వైపు ఏజెంటు ద్వారా వెళితేనే దాదాపు వాహనాలన్నీ ఫిట్‌నెస్ పాస్‌వుతున్నాయని, ఏజెంట్ ద్వారా కాకుండా నేరుగా వెళితే.. ఆటోమేటెడ్ మిషన్ ద్వారా కాకుండా మాన్యువల్ చేసే కొన్ని నిబంధనల్లో ఏదో ఒక కొర్రీ వేసి వెనక్కు పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి. బస్సులకు అతికించే రేడియం స్టిక్కర్లు కూడా అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. లోపలికి వచ్చిన తర్వాత రేడియం స్టిక్కర్లు వేయించుకోవాలని, బయట వేసే స్టిక్కర్లు చెల్లవని చెబుతున్నట్లు తెలిసింది. దీంతో రవాణా శాఖ అధికారులకు కూడా వాటా ఇవ్వాల్సి ఉంటుందని ప్రైవేటు వ్యక్తులు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యాలు వాపోతున్నాయి.

మే మొదటి వారం నుంచి జూన్ ఆఖరి వరకు..

పాఠశాలలు తెరిచే సమయం దగ్గరపడుతోంది. జూన్ 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం కానున్నాయి. స్కూల్ బస్సుల హడావుడి కూడా పెరిగింది. 8 ఏళ్లలోపు సర్వీసులో ఉన్న స్కూల్ బస్సులు రెండేళ్లకోసారి ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉండగా ఆ పైబడి సర్వీసు ఉన్న స్కూల్ బస్సులన్నీ ప్రతి ఏడాది ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిందే. ప్రతి ఏడాది మే మొదటి వారం నుంచి జూన్ ఆఖరి వరకు ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు తిరిగితే మాత్రం రవాణా శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. రెండు ఉమ్మడి జిల్లాలో 1400 పైగా స్కూల్స్, కళాశాలల బస్సులు ఉన్నాయి. పాఠశాలలను తెరిచేనాటికంతా ఈ స్కూల్స్, కళాశాలల యజమాన్యాలు వాటి బస్సులకు మరమ్మతులు చేయించుకుని ఫిట్‌నెస్ చేయించుకోవాలి.

సుమారు 15 నిబంధనలు తనిఖీ..

మోటారు వాహనాల చట్టం ప్రకారం అన్ని పాఠశాలల బస్సుల్లో 33 నిబంధనలు తప్పనిసరి చేశారు. చిన్నచిన్న లోపాలకు కూడా అవకాశం లేకుండా పారదర్శకంగా పూర్తిస్థాయి సామర్థ్యం తో పాఠశాలల బస్సులు ఉండాలన్నదే ప్రభుత్వ నిర్ణయం. ఈ నేపథ్యంలో గతంలో ఫిట్‌నెస్ పరీక్షలన్నీ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు చేసేవారు. అక్కడ కొంత అవినీతికి తావుండేది. ఈఏడాది నుంచి మాత్రం ఆటోమేటెడ్ మిషన్ల ద్వారా 33 నిబంధనల్లోని సుమారు 15 నిబంధనలు తనిఖీలు చేస్తారు. ముఖ్యంగా బ్రేకుల సామర్థ్యం, టైర్ల సామర్థ్యం, వీల్ అలైన్‌మెంట్, స్టీరింగ్ కండిషన్ తదితర అంశాలన్నీ ఈఆటోమేటెడ్ మిషన్ ద్వారానే నిర్వహిస్తారు. మిగతా కొన్ని ప్రమాణాలు రేడియం స్టిక్కర్లు, ఇతరత్రా కొన్ని మాన్యువల్ విధానంలోనే అమలు చేస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీలు ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేస్తారు. ఆ తర్వాత ఏ సంఘటన జరిగినా వారిదే బాధ్యత అవుతుందని, ఇక్కడ పుల్లీ ఆటోమేటెడ్ మిషన్ ద్వారా తనిఖీ చేయడంతో వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఎవరూ ఉండరు. అందరూ ప్రైవేటు వ్యక్తులే ఉంటారు.

- బడి బస్సులకు నూతన విధానంలో ఫిట్‌నెస్ పరీక్షలు
- ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగింత
- అక్కడంతా ఏజెంట్లదే హవా
- ఆటోమేటెడ్ మిషన్ ద్వారా సామర్థ్య పరీక్షల నిర్వహణ
- ప్రతి స్కూల్ నుంచి రూ. 3వేల నుంచి రూ.4వేలు వసూలు
- లబోదిబోమంటున్న స్కూళ్ల యాజమాన్యాలు
- ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సిందే : శాంతకుమారి, డీటీసీ

అదనంగా వసూలు చేస్తే చర్యలు

ఆటోమేటెడ్ మిషన్ల ద్వారా వాహన సామర్థ్యం పరీక్షలు నిర్వహించేందుకు ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించాం. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకునే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చలానా కట్టాలి. ఎవరైనా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. అలా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి పాఠశాల, కళాశాల బస్సు పాఠశాల తెరిచేలోగా పిట్‌నెస్ చేయించుకోవాల్సిందే.

- శాంతకుమారి, డీటీసీ, కర్నూలు



గడువు దాటితే సీజ్

గతంలో మాదిరిగా గడువు దాటినా నిదానంగా ఎఫ్‌సీలు చేయించుకుందామంటే ఇక కుదరదు. గతంలో రోజుకు ఎన్ని వాహనాలు వెళ్లినా ఎఫ్‌సీలు చేసేవారు. ప్రస్తుతం ఆటోమేటెడ్ మిషన్ల ద్వారా 30బస్సులను మాత్రమే తనిఖీలు చేస్తున్నారు. అందులో నిబంధనలు పాటించని వాటిని వెనక్కు తిరిగి పంపుతు న్నారు. వీటన్నింటిని కంప్యూటర్‌లో నమోదు చేసి ఆరోజు సాయంత్రానికే సర్టిఫికెట్ జారీచేస్తారు. అయితే జూన్ మొదటి వారంలోగా ఎఫ్‌సీ చేయించు కోవాలి. ఆ తర్వాత వాహనాల తనిఖీల్లో దొరికితే మాత్రం సీజ్ చేస్తారు.



పొలం పత్రాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తుడు

ఉరుకుంద ఈరన్నకు
రూ.7కోట్ల విలువైన స్థలం
కర్ణాటక భక్తుడి విరాళం

కౌతాళం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి పేరు మీద తన 1.2 ఎకరాల పొలాన్ని కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించిన దస్తావేజుల ఆలయ డిప్యూటీ కమిషనర్‌కు, ఈఓ మేడిపల్లి విజయరాజుకు శుక్రవారం అందజేశారు. శుక్రవారం దేవస్థానపు కార్యాలయంలో ఈవో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్పలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన తిప్పయ్య అనే భక్తుడు రూ. 7కోట్లు విలువ చేసే 1.2ఎకరాల భూమిని దేవాలయానికి విరాళంగా అందించినట్లు తెలిపారు. దాత కోరిక మేరకు ఈ స్థలంలో భక్తులకు రెండు డార్మిటరీ హాళ్లు, భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కల్యాణ కట్టను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే మరో భక్తుడు విరాళంగా ఇచ్చిన రూ.2.3 కోట్లతో భక్తులకు మూడు అంతస్థుల అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదికలను పంపినట్లు తెలిపారు. గోశాల అభివృద్ధికి ఇద్దరు భక్తులు రూ.13లక్షలతో ముందుకు వచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ సిబ్బంది వెంకటేశ్వర్లు, కుమార్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ఆరు బైకులు, రూ.52వేలు స్వాధీనం

కోసిగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద భోంపల్లి గ్రామ పరిధిలో ఓ పొలంలో చెట్టు కింద పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లపై కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి సిబ్బందితో కలిసి దాడులు చేసి 15 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి 6 మోటారు సైకిళ్లు, 7 సెల్‌ఫోన్లను సీజ్ చేసి రూ.52వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. శుక్రవారం కోసిగి సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం పెద్దభోంపల్లి గ్రామ సమీపంలో చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన 9 మంది, మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి చెందిన ముగ్గురు, ఐరంగల్ గ్రామానికి చెందిన ఒకరు, జంపాపురం గ్రామానికి చెందిన ఒకరు, డి.బెళగల్ గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేసి వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, మునిస్వామి, షేక్షావలి, తదితరులు ఉన్నారు.

పర్వతారోహకుడికి చేయూత

- 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కింద సాయం
- రూ.4లక్షలు అందించిన ఆర్సెల్ మిట్టల్ కంపెనీ



పర్వతారోహకుడు సురేష్‌బాబుకు రూ.4 లక్షల చెక్కును అందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి-బంగారు కుటుంబం (పీ4- పాలసీ) కింద పర్వతారోహకుడికి చేయూతను అందించారు. శుక్రవారం గోనెగండ్ల మండలానికి చెందిన పర్వతా రోహకుడు సురేష్‌కు ఆర్సెల్‌మిట్టల్ కంపెనీ వారి ద్వారా రూ.4లక్షలు ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ-4పాలసీ కింద రాష్ట్ర ప్రభుత్వ 'మార్గదర్శి- బంగారు కుటుంబం' ద్వారా పేదలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా పర్వతారోహకుడు జి.సురేష్ బాబుకు ఆర్సెల్ మిట్టల్ కంపెనీ ద్వారా ఆర్థికసాయం అందించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్, ఆర్సెల్ మిట్టల్ కంపెనీ ప్రతినిధులు లక్ష్మీకాంత్, శ్రీధర్, సీపీవో హిమ ప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన కల్పించాలి

నంద్యాల కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని తిరుపతి క్వాలిటీ కంట్రోల్ ఎనర్జీ సీజీ ఎం ఆడిట్ ఆదిశేషయ్య సూచించారు. శుక్రవారం నంద్యాల రామకృష్ణ కళా శాల ఆడిటోరియంలో విద్యుత్ శాఖ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ద్వారా వినియోగదారులకు లభించే వివిధ రాయితీలు గురించి ప్రతి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం కింద బ్యాంకులు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నాయని చెప్పారు. సమావేశంలో విద్యుత్‌శాఖ నంద్యాల ఎస్ఈ సుధాకర్ కుమార్, ఈఈ శ్రీనివాసులురెడ్డి, ఎఈఈలు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

కలెక్టర్ ఉత్తర్వులు

నంద్యాల నూనెపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్లను బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాలలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా ఉన్న ఎస్.హసీనాబీని స్పెషల్ తహసీల్దార్ టీజీపీ లోకాలిజేషన్ నంద్యాల యూనిట్‌కు, నంద్యాల అర్బన్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియదర్శినిని నంద్యాల కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
డి.ఆల్ఫ్రెడ్	బండిఆత్మకూరు	కేఆర్ఆర్సీ, కలెక్టర్ ఆఫీస్ నంద్యాల
బి.సువర్ణ దేవి	అవుకు	ఉయ్యాలవాడ
పి.పద్మావతమ్మ	మహానంది	బండిఆత్మకూరు
వి.ప్రియదర్శిని	నంద్యాల అర్బన్	కలెక్టరేట్ నంద్యాల
ఎస్.రవికుమార్	చాగలమర్రి	డోన్
కె.నాగమణి	డోన్	శిరివెళ్ల
బి.పుష్పకుమారి	శిరివెళ్ల	అవుకు
ఎం.శ్రీనివాసులు	ఉయ్యాలవాడ	కొలిమిగుండ్ల
ఎస్.హసీనాబీ	ఏవో ఆర్డీవో కార్యాలయం	స్పెషల్ తహసీల్దార్, టీజీపీ లోకాలిజేషన్

బదిలీల జాతర

- వైద్య ఆరోగ్యశాఖలో ముగిసిన దరఖాస్తు స్వీకరణ
- 8 వరకు దరఖాస్తుల పరిశీలన
- 15నుంచి 17వరకు కౌన్సెలింగ్, బదిలీ ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లా కేంద్రాలకు భారీగా డిమాండ్

నంద్యాల హాస్పిటల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ బదిలీల జాతర కొనసాగుతోంది. దరఖాస్తుల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. వైద్య ఆరోగ్యశాఖలో ఎంపీహెచ్ఎస్, రేడి యోగ్రాఫర్స్, ఎంపీహెచ్ఈవో, ఫార్మసీ ఆఫీసర్లు, వైద్య అధికారులు, ఎంపీహెచ్ఏలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండేళ్లు సర్వీస్ దాటినవారు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కింద దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మినిస్టీరియల్ సిబ్బంది మూడేళ్లు దాటితే కచ్చితంగా బదిలీ కావా లని నిబంధన పెట్టింది. వైద్యాధికారులు ఐదేళ్లు పూర్తిచేసుకున్న వారు బదిలీకి అర్హత పొందారు. జిల్లాస్థాయి అధికారి పోస్టులకు ఉమ్మడి జిల్లా కేంద్రాలకు భారీగా డిమాండ్ పెరిగినట్లు తెలు స్తోంది. వైసీపీ ప్రభుత్వం జిల్లాలు విభజన చేసిందే కానీ అధికా రాలు మాత్రం పాత జిల్లాకేంద్రాలకే ఇచ్చింది. దీంతో ప్రస్తుతం కొత్త జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లాస్థాయి అధికారులకు బదిలీలపై ఎలాంటి అధికారాల్లేకపోవడంతో కేవలం ఉమ్మడి జిల్లా కేంద్రాల అధికారులకు దరఖాస్తులను ఫార్వర్డ్ చేయాల్సిన పరిస్థితి నెల కొంది. ఇప్పటివరకు ఆర్డీ స్థాయిలో 90, స్టేట్ స్థాయిలో 10, డీఎంహెచ్‌వో పరిధిలో 20మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. సిబ్బందికి పోస్టింగ్ కోసం 5ప్లేస్‌లు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. 6వ తేదీ నుంచి 8వ తేదీ దరఖాస్తులను పరిశీలిస్తారు. 9వ తేదీన అర్హత కలిగిన ఉద్యోగుల జాబితాను ప్రదర్శించనున్నారు. ఈ 15నుంచి 17వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. అనంతరం బదిలీల ఉత్తర్వులు జారీ అవుతాయి.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

డీఎంహెచ్‌వో పరిధిలో ఖాళీలు..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో మల్టీపర్పస్ హెల్త్ సూపర్ వైజర్లు (మేల్)4, రేడియోగ్రాఫర్ 1, స్టాఫ్‌నర్స్‌లు 8, ఫార్మసీ ఆఫీ సర్లు 6, పబ్లిక్‌హెల్త్ నర్స్ (ఎన్‌టి)2, మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ 6, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఫిమేల్) ఉమ్మడి జిల్లాలో 22, వైద్య అధికారులు 12పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్య అధికారుల పోస్టులు కొత్తగా ప్యాపిలి, ప్రాతకోట, పేరుసోముల, కొత్తపల్లె, బైర్లూటి, టంగుటూరు పీహెచ్‌సీలతో పాటు ముందుగా ఉన్న ఖాళీలు మరో 6ఉన్నాయి.

డీసీహెచ్ఎస్ పరిధిలో..

జిల్లాలో డీసీహెచ్ఎస్ పరిధిలో థియేటర్ అసిస్టెంట్లు 4, ల్యాబ్ టెక్నీషియన్ 1, ల్యాబ్ అటెండెంట్ 1, పోస్టుమార్టం అసిస్టెంట్లు 4, జూనియర్ అసిస్టెంట్లు 6, జీడీఏలు 16పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సీనియర్ ఏఎన్ఎంలకు స్థానాల్లేవు

గత ప్రభుత్వంలో నియమించిన ఏఎన్ఎంలకు ప్రస్తుతం బదిలీల్లో జిల్లా కేంద్రం, ప్రధాన మండల కేంద్రాల్లో స్థానాల్లేకపోవడంతో వారు నిరాశగా ఉన్నారు. బదిలీల్లో వీరికి అవకాశం ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సచివాలయాల్లో ఏఎన్ఎంలను నియ మించి మూడేళ్లతర్వాత రెగ్యులర్ చేశారు. దీంతో ప్రస్తుతం సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న హెల్త్‌అసిస్టెంట్లు అక్కడే పనిచేయాల్సిన పరిస్థితి. బదిలీల్లో భాగంగా రీ రిప్లాయ్‌మెంట్ రద్దవుతుందని సీనియర్ ఎంపీహెచ్ఏలు ఆశించారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్రహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలో గత త్రైమాసిక కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ 65 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో అయా శాఖల ద్వారా 53 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో ఉన్న 12 దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, ఎల్‌డీఎం రవీందర్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజమహేంద్రనాథ్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి, రవాణాశాఖ అధికారి ఐశ్వర్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ముందస్తు పుట్టిన రోజు వేడుకలు

కర్నూలు హాస్పిటల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం ముందస్తు పుట్టిన రోజు వేడుకలు చేసుకోవడం ప్రస్తుతం విమర్శలకు తావిస్తోంది. రేపు, ఎల్లుండి సెలవులు ఉండటంతో ముందుగానే పుట్టిన రోజు వేడుకలను హాస్పిటల్ ఆవరణలోని సార్జంట్ రూం ఎదుట ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో పని చేస్తున్న నర్సులు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, నాల్గవ తరగతి సిబ్బంది సెక్యూరిటీ, శానిటేషన్ పెస్ట్ కంట్రోల్ ఉద్యోగులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఉద్యోగులకు బిర్యానీ ప్యాకెట్లు, అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. 8 కొవిడ్ కేసులు ఉన్న ఆసుపత్రిలో ఇలా అంతమంది ఉద్యోగులు, ఏజెన్సీ ఉద్యోగులు గుమికూడి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవడం విమర్శలకు తావిస్తోంది. అది కూడా కొత్తగా ఏర్పాటు చేస్తున్న కొవిడ్ వార్డు సమీపంలో ఈ వేడుకలు జరుపుకోవడం విశేషం.



కేక్‌ను కట్ చేస్తున్న హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం

యోగా గురువులకు 'యోగా భూషణ్' అవార్డులు

- 12 ఏళ్లు యోగాలో సేవ చేసినవారికి అవార్డు : మంగేష్ త్రివేది
- అవార్డు రావడం సంతోషంగా ఉంది: యోగా గురువులు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):కర్నూలు జిల్లాకు చెందిన యోగా గురువులు డా.ఎస్. ముంతాజ్‌బేగం, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టికి అఖిల భారత యోగా శిక్ష సంఘం జాతీయ అధ్యక్షులు మంగేష్ త్రివేది ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఆదియోగి యోగా భూషణ్ అవార్డులను ప్రకటించారు. 12ఏళ్లకు పైగా యోగాలో సేవలందిస్తున్న వారికి ఈఅవార్డు ప్రదానం చేస్తు న్నట్లు మంగేష్ త్రివేది తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ శెట్టి, ముంతాజ్ బేగం మాట్లాడుతూ అఖిల భారత యోగా శిక్ష మహా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఢిల్లీలో అవార్డు అందుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తమను ప్రోత్సహించిన వారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వాసులకు అవార్డు రావడంపై యోగా సంఘం చైర్మన లక్ష్మీకాంతరెడ్డి, కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో విజయకుమార్, అధ్యక్ష కార్యదర్శులు కేతఈ జగదీష్‌కుమార్, శ్రీనివాసులు, క్రీడాసంఘాల కార్యదర్శులు డా.రుద్ర రెడ్డి, ఈశ్వర్ నాయుడు హర్షం వ్యక్తంచేశారు.



అవినాష్ శెట్టి



ముంతాజ్‌బేగం

పూణే ల్యాబ్‌కు పరిశోధనలు

- శ్రీశైలం జలాశయం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఆనకట్ట ప్లంజ్‌పూల్‌పై శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలను పూణే ల్యాబ్‌కు తరలించినట్లు జలాశయం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఐదు రోజుల నుంచి పూణెకు చెందిన శాస్త్రవేత్తల బృందం ప్లంజ్‌పూల్‌పై విస్తృతంగా పరిశోధనలు నిర్వహించారు. ఆ పరిశోధనల సమగ్ర నివేదికను ల్యాబ్‌లో పరిశీలించిన అనంతరం నివేదికలు సమర్పించనున్నారని ఎస్ఈ తెలిపారు. ప్రస్తుతం వైజాగ్ నుంచి వచ్చిన అండర్ వాటర్ వీడియోగ్రఫీ బృందం తమ పరికరాలు, ఇతర సామగ్రిని ఆనకట్ట వద్దకు చేర్చుకున్నారు. వాటర్ వీడియోగ్రఫీ 20 రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు.



అండర్ వాటర్ వీడియోగ్రఫీ బృందం

మీదివేములలో భగ్గుమన్న ఫ్యాక్షన్

- మాజీ ఎంపీటీసీ హత్య నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు
- నిందితుల కోసం గాలింపు

ఓర్వకల్లు/ కర్నూలు క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీదివేముల గ్రామంలో మళ్లీ ఫ్యాక్షన్ భగ్గుమంది. గురువారం రాత్రి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోయ రమేష్‌నాయుడు(45) దారుణ హత్యకు గురి కావడం తెలిసిందే. నన్నూరు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. మీదివేముల సమీపంలో దిగువయ్య దర్గా మలుపు వద్ద కాపు కాచిన గుర్తు తెలియని దుండగులు బైక్‌ను ఆపి రమేష్‌నాయుడుపై బీరు సీసాలతో దాడి చేసి పొలంలోకి తీసుకెళ్లి రమేష్‌నాయుడు తలపై భారీ బండరాయితో మోది విచక్షణారహితంగా దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం గ్రామానికి తీసుకొచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మీదివేములలో గట్టి పోలీసు బందోబస్తు చేశారు. అంత్యక్రియలు ప్రశాంతంగా జరిగాయి. ఆరుగురు టీడీపీ నాయకులు మేడం రామాంజనేయులు, మేడం తిరుపాలు, బోయ బుగ్గరాముడు, మేడం నాయుడు, మేడం రాజు, మేడం శ్రీనివాసులపై మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో హత్య చేసిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ వద్ద ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. హత్య చేసిన నిందితులను త్వరగా పట్టుకుని అరెస్టు చేస్తామని సీఐ చంద్రబాబునాయుడు తెలిపారు. మీదివేముల గ్రామంలో 1987లో అంటే 38ఏళ్ల తర్వాత ఫ్యాక్షన్ మొదలైంది. ఆ గ్రామానికి కరిమద్ది హత్య కేసులో 13 మంది నిందితులకు కారాగార శిక్ష విధించిన నేపథ్యంలో మళ్లీ గ్రామంలో ఫ్యాక్షన్ హత్య జరగడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. మాజీ ఎంపీటీసీ రమేష్ నాయుడు హత్యకు గురి కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి హాజరై నివాళులర్పించారు. మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మృతునికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.


రమేష్‌నాయుడు (ఫైల్)

మృతుడి రాజకీయ నేపథ్యం

రమేష్ నాయుడు మొదటి నుంచి కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి సన్నిహితంగా ఉండేవాడు. 2014 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరపున ఎంపీటీసీగా భారీ మెజారిటీతో గెలుపొందారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు,

మీదివేముల గ్రామ వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బోయ రమేష్ నాయుడు దారుణహత్యకు పాల్పడిన టీడీపీ నాయకులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలి. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందుకే టీడీపీ వర్గీయులు ఓర్వలేక ఆయనను హత్య చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ


హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

ఎస్పీ విక్రాంత్ పాటిల్ సంఘటనా స్థలాన్ని గురువారం రాత్రి పరిశీలించారు. గ్రామంలో పర్యటించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మొదట ఇది రాజకీయ హత్యగా భావించిన పోలీసులు గ్రామంలో పెద్ద ఎత్తున పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా పటిష్ఠమైన బందోబస్తును పోలీసులు చేపట్టారు.

బైక్ అదుపు తప్పి మహిళ మృతి


వైష్ణవి మృతదేహంతో రోధిస్తున్న అక్క దుర్గ

వెల్దుర్తి టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణం సమీపంలోని నక్కలమిట్ట వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న మహిళ వైష్ణవి (30) కింద పడి తలకు బలమైన గా యం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శుక్రవారం జరిగింది. అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దుర్గ, వైష్ణవి అనంతపురం నుంచి వెలుగోడు మండలంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయల్దేరారు. వెల్దుర్తి పట్టణ సమీపంలోని నక్కలమిట్ట వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. వైష్ణవి తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. దుర్గకు స్వల్పగాయాలు అయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరు వరుసకు అక్కాచెల్లెళ్లు అవుతారని, వైష్ణవి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబానికి సమాచారం ఇచ్చామన్నారు.

జనని బ్యాంకు కేసులో ఇద్దరి అరెస్టు

కోవెలకుంట్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జనని సహకార సంఘం బ్యాంకు కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ తెలిపారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జనని మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీ లిమిటెడ్ బ్యాంకును అక్టోబరు 2021లో కోఆపరేటివ్ రిజిస్టరు ఆఫీసు కర్నూలులో రిజిస్టరు చేయించి ఇందులో కీలక పాత్ర పోషించిన కడప జిల్లా సీకేదిన్నె మండలం సోమవాండ్లపల్లెకు చెందిన ఆకుల వెంకటరమణ, కోవెలకుంట్ల టౌన్ గడ్డమీదికి చెందిన గువ్వల పద్మావతి ఉన్నారు. వీరు మరికొంత మందితో కలిసి ఒక పథకం ప్రకారం కోవెలకుంట్ల చుట్టుపక్కల ప్రజలతో డబ్బులు కట్టించి ఎక్కువ వడ్డీలు ఇస్తామని ఆశ చూపి కొంత మందికి లోన్లు ఇచ్చి ప్రజల నుండి స్వీకరించిన డబ్బులు దుర్వినియోగం చేసేందుకు పన్నాగం పన్నారు. ఈ మేరకు జనని బ్యాంకులో వేసిన డబ్బులను సీఈవో వెంకట్రమణ లింకు ఇప్పించి డబ్బులను వేర్వేరు అకౌంట్లలోకి బదిలీ చేసి వచ్చిన నగదు కూడా వారి సొంతానికి వాడుకున్నారు. రెండు, మూడు సంవత్సరాల ఫిక్స్ డ్ డిపాజిట్‌లో సేవింగ్స్ చేసుకున్న వారికి గడువు అయిపోయినా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారని బాధితులు బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయగా ఇప్పటి వరకు ఐదుగురు వ్యక్తులు మోసపోయినట్లు తెలిపారు. మొత్తం రూ.13.45 లక్షలు మోసపోయినట్లు తెలిపారు. జనని బ్యాంకులో గడువు తీరినా డబ్బులు పొందని వారు ఇంకా ఉంటే వారు ఉంటే తమను సంప్రదించాలని సీఐ తెలిపారు. సొసైటీ సీఈవో రమణ పద్మావతి తదితరులపై కేసు నమోదు చేశామని, మిగతా వారిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

ఆశల ఖరీఫ్!

5వ పేజీ తరువాయి

పుస్తకం సర్దుబాటు పేరుతో..



స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూల్స్ ప్రకారం పంట రుణాలు రూ.3,150 కోట్లు ఇవ్వాలని లక్ష్యం. పంటరుణాల కోసం బ్యాంకులకు వెళితే రెన్యువల్ పేరుతో పుస్తకం సర్దుబాటు చేస్తున్నారు. రికార్డుల్లో ఖరీఫ్ పంట రుణం ఇచ్చినట్లు చూపుతారు. పెట్టుబడి అప్పుల కోసం అవస్థలు తప్పడం లేదు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు చేసి నష్టపోతున్నారు.

కౌలు రైతులపై కరుణేదీ?



జిల్లాలో కౌలురైతులు 25వేల మంది ఉన్నారని అధికారిక లెక్కలు. అనధికారిక లెక్కలు ప్రకారం 50 వేలకు పైగా ఉన్నారని అంచనా. గతేడాది 23,350 మంది కౌలు రైతులకు హక్కు పత్రాలు జారీ చేసినా.. పంట రుణాలు ఇచ్చింది మాత్రం కేవలం 132 మంది రైతులకు రూ.65 లక్షలే. ఈ ఏడాదైనా హక్కు పత్రాలు ఉన్న రైతులు అందరికి పంట రుణాలు ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఊరట కల్పించిన 'మద్దతు'



2025-26 ఖరీఫ్ సీజన్‌కు సబంధించిన 14 ముఖ్యమైన పంటలకు మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. గతేడాదిలో పోలిస్తే.. క్వింటాపై వరి ధాన్యం పంటకు ధర రూ69, జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తున్న పత్తికి రూ.589 పెంచారు. పంటలు ఉత్పత్తి వ్యయంలో 50 శాతానికి పైగా ఆదాయం ఉండేలా ఎంఎస్‌పీ నిర్ణయించారని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. పెరిగిన ధరలు ప్రకారం క్వింటా వరి సాధారం రూ.2,369, గ్రేడ్-ఏ రూ.2,389లకు, పత్తి మధ్యస్థ రకం రూ.7,710లకు, పింజె పొడవు రకం పత్తి రూ.8.110లకు, కంది రూ.8,000, పెసలు రూ.8,768లకు, మినుము రూ,7,800లకు, వేరుశనగ రూ.7,263లకు, సూర్యకాంతి రూ.7,690లకు చేరింది. ఎంఎస్ పీ పెంచడంతో రైతులకు ఊరట కల్పిస్తుంది.

జిల్లాకు కేటాయించిన విత్తనాలు (క్వింటాళ్లు), క్వింటా ధరపై రాయితీ (శాతం) వివరాలు

విత్తన రకం	కేటాయింపు	రాయితీ
వేరుశనగ	9,099	40 శాతం
కంది	892.50	30
మినుము	25	30
పెసర	10	30
కొర్రలు	70	50
జీలుగ	154	50
పిల్లిపెసర	11	50

అన్నదాత సుఖీభవ



● ఖరీఫ్ లక్ష్యం (హెక్టార్లలో):

పంటలు	లక్ష్యం
వరి	12,919
వేరుశెనగ	54,710
పత్తి	2,34,409
కంది	33,296
సజ్జ	3,939
మొక్కజొన్న	5,101
కొర్ర	2,679
ఆముదం	8,951
మిరప	36,222
ఉల్లి	16,577
వాము	564
టమోటా	2,890
పొగాకు	1,415
ఇతర పంటలు	8,868
మొత్తం	4,22,540

టీడీపీ కూటమి గత ఎన్నికల ముందు 'సూపర్ సిక్స్'లో భాగంగా 'అన్నదాత సుఖీభవ పథకం' కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద ఇచ్చే రూ.6 వేలు సాయంతో కలిపి అన్నదాత సుఖీభవ పథకం సాయం ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఇస్తామని సీఎం చంద్రబా బు స్పష్టత ఇచ్చారు. జిల్లాలో 2.50 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. 2025 ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎం కిసాన్) తొలి విడత రూ.2 వేలు చొప్పు న రూ.50 కోట్లు, రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ సాయం రూ.4,500 చొప్పున రూ.112 కోట్లు రైతు ఖాతాలో జమ చేయాల్సి ఉంది. రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నేడు తెలంగాణ డిప్యూటీ సీఎం రాక

- పిన్నాపురంలో ప్రాజెక్టుల పరిశీలన

కర్నూలు, అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. శుక్రవారం కర్నూలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 6గంటలకు బేగంపేట నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి కర్నూలు నగర శివారులోని టోల్‌ప్లాజాకు ఉదయం 8.30కు చేరుకుంటారన్నారు. ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలుకుతారని తెలిపారు. అక్కడి నుంచి పాణ్యం నియోజవర్గం పరిధిలోని పిన్నాపురంలో నిర్మాణ దశలో ఉన్న ఇరిగేటెడ్ రెనెవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు (ఐఆర్ఈపీ) పనుల తీరును మాజీ పీసీసీ గిడుగు రుద్రరాజుతో కలిసి పరిశీలించనున్నారు. అనంతరం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కాంగ్రెస్ నాయకులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలపై చర్చించనున్నారు. తిరుగు ప్రయాణం కర్నూలు మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరుతారని తెలిపారు. సమావేశంలో నగర అధ్యక్షుడు జిలానీబాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చనిపోతూ ఆరుగురికి పునర్జన్మ

- బ్రెయిన్ డెడ్‌కు గురైన పంచాయతీ సెక్రటరీ
- అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు

కర్నూలు హాస్పిటల్/ గోస్పాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన నంద్యాల జిల్లా గుంటనాల పంచాయతీ సెక్రటరీ సుజాత (31) బ్రెయిన్ డెడ్ అయింది. బ్రెయిన్ డెడ్ అయిన ఆ పంచాయతీ సెక్రటరీ అవయవదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ఆరుగురికి పునర్జన్మ ఇచ్చారు. నంద్యాల జిల్లా నంద్యాల మండలం గుంతనాల గ్రామానికి చెందిన సుజాత గోస్పాడు మండలంలోని తేళ్లపురి గ్రామంలో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. గత నెల 28వ తేదీ విధి నిర్వహణలో నంద్యాల జిల్లా గోస్పాడు మండలం తెల్లపురి గ్రామంలో ద్విచక్రవాహనంపై వెళ్తూ కింద పడిపోయి తలకు తీవ్ర గాయం కావడంతో నంద్యాలకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను ఈ నెల 4వ తేదీన కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. దురదృష్టవశాత్తు శుక్రవారం ఉదయం ఆమె బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో కర్నూలు డిస్ట్రిక్ట్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, కుటుంబ సభ్యులైన అక్క, తమ్ముడికి అవగాహన కల్పించడంతో వారు అవయవదానానికి ముందుకు వచ్చారు. అనంతరం సుజాత బంధువులు, తల్లిదండ్రులు అంగీకారంతో రెండు ఊపిరితిత్తులు, రెండు కళ్లు, రెండు కిడ్నీలను దానం చేశారు. ఇందులో రెండు ఊపిరితిత్తులను హైదరాబాదు కిమ్స్ హాస్పిటల్‌కు, రెండు కళ్లను హైదరాబాదు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు రెండు కిడ్నీలను కర్నూలు కిమ్స్‌కు తరలించారు. అవయవాల తరలింపునకు కిమ్స్ హాస్పిటల్ సీఈవో సునీల్ కుమార్ ఏర్పాట్లు చేశారు. అవయవాలను తరలించేందుకు పోలీసులు గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేసి వాటిని వేగంగా తరలించినట్లు కిమ్స్ హాస్పిటల్ సీఈవో సునీల్ కుమార్ తెలిపారు. అనంతరం అవయవదానం చేసేందుకు అంగీకరించిన సుజాత అక్క, తమ్ముడు, తల్లిదండ్రులు, బంధువులను కిమ్స్ హాస్పిటల్ సీఈవో సునీల్ కుమార్, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా.గోవిందరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జీవనధార నుంచి చెక్కును అందజేశారు.


జీవన్‌ధాన్ నుంచి చెక్కును కుటుంబ సభ్యులకు అందిస్తున్న డాక్టర్ గోవిందరెడ్డి


సుజాత (ఫైల్)

అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా

- రైతులకు మేలు చేస్తా
- సీఎం నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి
- ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం


బాధ్యతలు స్వీకరిస్తున్న కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి


విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ,ఎమ్మెల్యే, నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మంత్రులు, ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల ఎంపీలు, టీడీపీ ముఖ్యనేతలు, రైతుల సహకారంతో బ్యాంకు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో బ్యాంకు చైర్మన్‌గా రైతుల సమక్షంలో ఘనంగా ప్రమాణస్వీకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు, పాణ్యం, కర్నూలు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున రైతులు, అనుచరులు, టీడీపీ వర్గాలు తరలి వచ్చారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, పరిశీలకుడు రామలింగేశ్వర రెడ్డి, ఇతర నాయకులు బొజ్జన్న పాల్గొన్నారు. బ్యాంకు సీఈవో రామాంజనేయులు చైర్మన్ విష్ణువర్దన్‌రెడ్డితో ప్రమాణ స్వీకారోత్సవాన్ని చేయించారు. ఈ సం దర్భంగా విష్ణువర్దన్‌రెడ్డి ఎంతో భావోద్వేగంతో తన ప్రసంగాన్ని కొనసాగించారు. తన తనయుడు రాజవర్దన్‌రెడ్డి ప్రజలతో మమే కమై వారి కష్టసుఖాలే తన జీవనంగా కొనసాగించారని, అకాల మరణంతో తాను ఎంతో బాధ అనుభవించినా చివరకు ఆయన ఆశయాన్ని సాధించేందుకు టీడీపీ వేదికగా కష్టపడుతూ వచ్చాన న్నారు. తనమీద నమ్మకంతో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా పదవి ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని రైతుల సమక్షంలో ప్రకటించారు. ఏనాడూ పదవుల కోసం ఆరాట పడలేదని, ప్రజల కష్టాసుఖాల్లో పాలుపంచుకోవడానికే ప్రతిక్షణం ఆరాటపడ్డానని అన్నారు. తెలుగుదేశం పార్టీలో ఎప్పటి నుంచో ఒక సైనికుడిలా పని చేశానన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకే కాకుండా పొదుపులక్ష్మి మహిళలకు, అన్ని వర్గాల వారికి ఆర్థిక చేయూత అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ విష్ణువర్ధన్ రెడ్డి కర్నూలు జిల్లాలో టీడీపీ తిరుగులేని విధంగా గొప్ప స్థానాన్ని అందించారన్నారు. అనంతరం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, రాబోయే కాలంలో రూ.6వేల కోట్ల వ్యాపారాన్ని పెంచుకుని మూడో స్థానానికి ఎదిగేందుకు చైర్మన్ తమకు అం డగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామాంజనేయులు, బ్యాంకు బీఎం శివలీల, డీజీఎంలు నాగిరెడ్డి, సునీల్ కుమార్, ఉమామహేశ్వరరెడ్డి, ఏజీఎంలు త్రినాథ్ రెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మనిషి విష్ణువర్ధన్ రెడ్డి : తిక్కారెడ్డి

కోడుమూరు నియోజకవర్గంతో పాటు కర్నూలు జిల్లాలో ఒక బలమైన నాయకుడిగా, ప్రజల మనిషిగా విష్ణువర్ధన్ రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారనీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ పదవిని విష్ణువర్దన్‌రెడ్డికి అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.

కనీస సౌకర్యాలు కరువు



ఎస్ఆర్‌బీసీ కాలనీలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలు



ముళ్లపొదల్లో ఉన్న టిడ్కో గృహాలు

- ముళ్లపొదల్లో టిడ్కో గృహాలు
- పాఠశాలకు 5 కి.మీ. దూరం వెళ్లాల్సిందే
- వేధిస్తున్న తాగునీటి సమస్య

నంద్యాల టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ ప్రభుత్వం ఇళ్లులేని వారికి ఇళ్ల నిర్మించి ఇవ్వాలని ఉద్దేశ్యంతో సరికొత్త పద్ధతిలో టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను నిర్మించి ఇవ్వాలని తలపెట్టింది. దీంతో నంద్యాల నియోజక వర్గంలో ఎస్ఆర్‌బీసీ, అయ్యలూరు వద్ద టిడ్కో గృహ సముదాయాలను నిర్మించింది. అయితే అప్పటి ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రజలకు ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నంద్యాల నియోజకవర్గంలో 10వేల ఇళ్లను నిర్మించింది. అయితే కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నంద్యాలలో 10 వేల ఇళ్లను నిర్మించగా వాటిలో మొదటి విడదలో 1,045 ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చింది. తర్వాత మళ్లీ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 1000 ఇళ్లను నిర్మించారు. వాటిలో ఎస్ఆర్‌బీసీ కాలనీలోనే ఇచ్చారు. అక్కడ కేవలం 100 నుంచి 150 కుటుంబాలు మాత్రమే నివశిస్తున్నాయి. రెండేళ్ల నుంచి ప్రజలు పాఠశాలలు లేక, దొంగలు, పాముల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయ్యలూరు వద్ద ఇప్పటి దాకా ఎవ్వరికీ ఇవ్వలేదు.

పాఠశాలలు లేక ఇబ్బందులు

టిడ్కో గృహ సముదాయాలల్లో పిల్లలను చదివించడానికి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలు లేక సుమారు 5 కిలోమీటర్ల దూరం పంపించడానికి అనేక వ్యయ ప్రయాసలు పడుతు న్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. రోజూ వాహనాల్లో తీసుకెళ్లాల్సి దుస్థితి ఉంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సార్బీసీ కాలనీలో సచివాలయం లేకపోవడంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బం దులు పడతున్నారు. గతంలో వారికి కేటాయించిన సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సచివాలయం లేకపోవడంతో సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వసతులు కల్పించలేదు



నీళ్ల, విద్యుత్ సరిగా లేవు. అలాగే నీళ్ల తక్కువగా వస్తున్నాయి. కాలనీలు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయంగా ఉంది. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు.
- మంగమ్మ, ఎస్సార్బీసీ కాలనీ

పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలి



రాత్రి సమయంలో బయటకు రావాలంటే చాలా భయంగా ఉంది. అలాగే ఇటీవల ఇక్కడ దొంగల పడ్డారు. పాములు బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.
- శివమ్మ, ఎస్సార్బీసీ కాలనీ

త్వరలో పూర్తి చేస్తాం

టిడ్కో గృహాల్లో వసతులు త్వరలోనే కల్పించాలని చేస్తున్నాం. పురపాలక పారిశుధ్య సిబ్బంది అక్కడి నుంచి మురుగు, చెత్తను తీసుకెళ్తున్నారు. పించన్లు వారి అవసరాలను తగినట్లుగా సచివాలయ సిబ్బందిని కేటాయించాం. ఈ విషయాన్ని వారికి కూడా చెప్పాం.
- వెంకటదాస్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ నంద్యాల

శివాలయ జీర్ణోద్ధరణకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయుని కొత్తూరు గ్రామంలో నాగలింగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ చేశారు. శుక్రవారం ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని ప్రభుత్వ శ్రేయోనిధులు రూ. 1.25 కోట్లతో నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆమె పాణ్యం లోని ఇందిరానగర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చెంచు యువకుని కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. టీడీపీ నాయకులు మిలిటరీ సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, రామ్మోహన్ నాయుడు, అమరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణమూర్తి, ఖాదర్‌బాషా, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి నాగేశ్వరరావు, అర్చకులు నారాయణస్వామి, సురేష్‌శర్మ, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మాపురంలో ఆలయ నిర్మాణానికి..

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో సుంకులా పరమేశ్వరి, సవారమ్మ నూతన ఆలయ నిర్మాణాల కోసం గ్రామపెద్దలు భూమి పూజ చేశారు. పురోహితులు వేద పండితులు మంత్రోచ్చరణ చేశారు. పెద్ద మద్దిలేటి గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గోవిందు, సురేష్‌రెడ్డి, పెద్ద ఆంజనేయులు, సుంకన్న, బోయ రమణ, బుసి గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పనులు ప్రారంభం

నంద్యాల కల్చరల్: నంద్యాల మూలమఠంలో వెలసిన భీమలింగేశ్వరస్వామి ఆలయం జీర్ణోద్దరణ పనులు శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, దేవదాయశాఖ ఉపకమిషనర్ గురుప్రసాద్, జిల్లా దేవదాయశాఖాధికారి మోహన్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

నేడు మహానందిలో 'యోగాంధ్ర'

మహానంది, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మహానందిలో శనివారం ఉదయం నిర్వహించే యోగాంధ్రకు ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆలయం మూడో ప్రాకారంలోని పచ్చిక మైదానంను శుభ్రం చేసి 1500 మంది వివిధ శాఖల అధికారులు, సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే విధంగా ఏర్పాటు చేసినట్లు ఈవో చెప్పారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈకార్యక్రమం అనంతరం హాజరైన అధికారులకు, సిబ్బందికి దేవస్థానం అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఈవో చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం మహానందిలో యోగాంధ్ర బెలూన్‌ను ఆలయ ఈవోతో పాటు మండల తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, ఈవోఆర్డీ నాగేంద్రుడు, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డితో పాటు ఏఈవో యర్రమల్ల మధు, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్‌లు పాల్గొని ఆవిష్కరించారు.

ఆలయ భూముల కౌలు వేలం

పాణ్యం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పాణ్యం దేవదాయశాఖ ఆలయ భూముల కౌలు వేలాలు శుక్రవారం నిర్వహించారు. ఈవో సువర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలాలలో వీరనారాయణ స్వామి ఆలయానికి చెందిన 11.08 ఎకరాలకు రూ.47 వేలు, పాణికేశ్వరస్వామి ఆలయ భూములు 25.35 ఎకరాలకు రూ. 1.49 లక్షలు, పడవెంకటాద్రి ఆలయానికి చెందిన 30 సెంట్లకు రూ.4100 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సత్యనారాయణస్వామి ఆలయానికి చెందిన 8.52 ఎకరాలకు రూ. 9,100 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఈవో కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పరిశీలకుడు



మంత్రి ఫరూక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రవికుమార్

నంద్యాల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గత నెల 27,28,29 వతేదిలలో కడపలో జరిగిన మహానాడు కార్యక్రమం విజయవంతంపై టీడీపీ నంద్యాల నియోజకవర్గ పరిశీలకుడు పోతురాజు రవికుమార్ న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు అభినంద నలు తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా మంత్రిని కలిశారు. ఆయన మాట్లాడుతూ మహానాడుకు అశేషజనవాహిని తరలి రావడంతో పార్టీలో మంచి జోష్ లభించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

నంద్యాల కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంక్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ కోసం హైదరాబాద్‌కు చెందిన గోవర్ధన్ దంపతులు రూ.1,00,000 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు రవికుమార్ రసీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందించారు. అనంతరం అర్చకులు దాత గోవర్ధన్ దంపతులను ఆశీర్వదించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పుస్తకాలను చదవడం ద్వారా ప్రతిఒక్కరికీ వ్యక్తిగతంగా ఆలోచనశక్తి పెరిగి వ్యక్తిత్వ వికాసం, మనోవిజ్ఞానం పెరుగుతుందని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్య అతిథులు సూచించారు. నంద్యాలలో పింగళిసూరన గ్రంథాలయంలో వేసవి పునఃశ్చరణ తరగతులు శుక్రవారంతో ముగిసాయి. గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్లికార్జున, రిటైర్డు గ్రంథాలయాధికారి సుబ్బారావు హాజరయ్యారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పాణ్యం: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28 న ప్రారంభమైన సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పశు సంవర్ధకశాఖ ఏడీ కమలాకర్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాల యంలో పఠనం చేయడం ద్వారా రీడింగ్ నైపుణ్యం, రైటింగ్ స్కిల్స్ పెరుగుతాయన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అంద జేశారు. గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి, ఉపాధ్యా యుడు నాగేశ్వరరావు, బీడీసీ సిబ్బంది, పాఠకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తూరులో మల్కాజ్‌గిరి ఎస్పీ పూజలు

పాణ్యం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెలంగాణ మల్కాజ్‌గిరి ఎస్పీ పద్మజారెడ్డి పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆమె తల్లి, సోదరుడితో కలిసి స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆమెను ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వ ర్యంలో సత్కరించారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వర రావు, అర్చకులు నారాయణస్వామి, సురేష్ శర్మ పాల్గొన్నారు.

కుందూ నదిని కాపాడాలి

నంద్యాల మున్సిపాలిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాలుష్య కాసారంలా మారుతున్న కుందూ నదిని కాపాడలని భారతీయ కిసాన్ సంఘం నాయకులు కలెక్టర్ రాజకుమారి గనియాను కోరారు. శుక్ర వారం సంఘం నాయకులు కుందూ తీరం వెంట పర్యటించారు. అనం తరం వారు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సంఘ్ రాష్ట్ర కార్యదర్శి కిసాన్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు, బాలు, సూరి బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ భూపాల్ రెడ్డి ఉన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి

నందికొట్కూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంతో పాటు అనుబంధ రంగాలైన పశుపోషన, ఉద్యానపంటల సాగు, కోళ్ల పెంపకం వంటి వాటిపై రైతులు దృష్టి సారించాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మీ సూచించారు. శుక్రవారం పగిడ్యాల మండలం సంకిరేనిపల్లి గ్రామంలో కేంద్రీ వ్యవసాయ మంత్రిత్వ శాఖ మరియు భారత వ్యవసాయ పరిశోధన మండలి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మరియు కృషి విజ్ఞాన కేంద్రం యాంటిపల్లె ద్వార వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త రవిగౌడ్, మండల వ్యవసాయ అధికారి జ్యోతి కుమార్, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

పాములపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు 11 మంది విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ నాగరవీంద్ర అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నవంబరులో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలలో ఉత్తీర్ణత సాధించారని, నంద్యాల జిల్లాలో ఒకే స్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం ఒక్క పాములపాడు మోడల్‌స్కూల్‌కి దక్కిందన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

పాణ్యం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులు చిరుదాన్యాల సాగుపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మిప్రియ సూచిం చారు. వికసిత్ భారత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నెరవాడ, బలపనూరు, కౌలూరు గ్రామాలలో రైతులకు వ్యవసాయ నిర్వహణపై అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, భూసార పరీక్షలు, ఎరువులు యాజమాన్యం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, చిరు ధాన్యాల సాగు, చీడపీడల గురించి వివరించారు. పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, పశుగ్రాసం, పాల ఉత్పత్తి, పశువుల వ్యాధులు నివారణ తదితర వాటిపై సంబంధిత అధికారులు వివరించారు. మహానంది పారం సిబ్బంది ధర్మారావు, పశువైద్యాధికారి పుల్లయ్య, డాక్టర్ సుగన్న, ఏఓ జయప్రకాష్‌రెడ్డి, ఏఏఓలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అవయవదానంపై అపోహలు వద్దు



నివాళి అర్పిస్తున్న ఫయాజ్, జిల్లా అధికారులు

నంద్యాల రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో అవయవదానం చాలా గొప్పదని, దీనిపై అపోహలు వద్దని టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ సూచించారు. నంద్యాల మండలం గుంతనాలకు చెందిన పంచాయతీ సెక్రటరీ సుజాత బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. దీంతో ఆమె అవయవాలను దానం చేశారు. సాయంత్రం బొమ్మలసత్రం ఆమె భౌతిక కాయానికి జిల్లా అధికారులు, పోలీసులు పాల్గొని నివాళి అర్పించారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి నివాళి

గోస్పాడు: మండలంలోని తేళ్లపురి గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.సుజాత (31) మృతికి నాయకులు, అధికారులు నివాళి అర్పించారు. ఎంపీడీవో అమానుల్లా, ఈవోఆర్డీ నాగ అనసూయ, తేళ్లపురి గ్రామ సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి, టీడీపీ మండల అధ్యక్షుడు తులసీశ్వరరెడ్డి కార్యదర్శి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. అలాగే నంద్యాల రూరల్ తహసీల్దార్ పత్తి శ్రీనివాసులు, ఎంపీడీవో సుగుణశ్రీ తదితరులు గుంతనాల గ్రామానికి చేరుకొని సుజాత కుటుంబీకులను ఓదార్చి, నివాళులు అర్పించారు. నంద్యాల జిల్లాలో అవయవాలను దానం చేసిన మొదటి ప్రభుత్వ ఉద్యో గిగా సుజాత నిలిచారు. ఆమె మృతదేహాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలో నంద్యాల, గోస్పాడు మండలాలకు చెందిన సచివాలయాల ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ప్రజలు వచ్చి నివాళి అర్పించారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ లలిత

మిడుతూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మిడుతూరులోని ఆరోగ్య కేంద్రాన్ని నంద్యాల డీసీహెచ్ఎస్ డాక్టర్ లలిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఓపి వివరాలు, మందుల పంపిణీ, మందుల స్టాకు వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్య అధికారి తిరుపతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎమ్‌లకు అనుబంధ ఆహారం డే సందర్భంగా ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ వారు ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీహెచ్ఎస్ డాక్టర్ లలిత, ఐఏపీ ప్రెసిడెంట్ విజయానంద్, సెక్రటరీ వీర రత్నాకర్ రెడ్డి , సీడీపీవో కోటేశ్వరమ్మ హాజరయ్యారు. ప్రపంచ పర్యావరణం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐఏపీ ట్రెజరర్ ప్రకాష్ ఆనంద్ వైద్య అధికారులు శారద, సాయిసుధ, భరత్ కుమార్, వీణ, ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేణుక దేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి

ఆత్మకూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతగా అందరూ మొక్కలు పెంచాలని అని మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. శుక్రవారం పర్యావరణ దినోత్సవంలో భాగంగా రెండవరోజు ఆత్మకూరులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మెప్మా సీఈవో వెంకటేశ్వర్లు ఉన్నారు.

మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రాల పరిశీలన

ఆత్మకూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని మురుగు నీటి శుద్ధికరణ ప్లాంట్లను (ఎస్ఎస్ టీపీ)మున్సిపల్ ఈఈ చంద్రమోహన్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ కాలువల ద్వారా వచ్చే మురుగు నీరు కలుషితం లేకుండా వాగుల్లోకి చేరేలా ఆత్మకూరు పట్టణంలో మూడు మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రాలను రూ.2 కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు. ఇందులో ప్రధానంగా ఎస్బీజీ పాలెం, జంబులా పరమేశ్వరి ఆలయం నందికుంట రస్తాలోని ఇటుకల బట్టి సమీపంలో ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ప్రధానంగా మురుగు నీటిని శుద్ధీకరించి ఆ నీరు నదుల్లోకి వెళ్లేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తద్వారా నదీజలాలు కూడా కలుషితాన్ని తగ్గించవచ్చన్నారు. మున్సిపల్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ జాకీర్, పబ్లిక్ హెల్త్ ఏఈ కేదార్, ఉన్నారు.

బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను జరుపుకోవడానికి ఈద్గాల్లో ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పరిశీలించారు. శుక్రవారం పట్టణంలోని భీమవరం రోడ్డులో ఉన్న ఈద్గాలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఏర్పాట్ల గురించి ఈద్గా కమిటీ సభ్యులను అడిగి తెలసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పండుగను ఆనందంగా జరుపుకోవాలి

ముస్లింలు ఎంతో పవిత్రమైన పండుగగా భావించే బక్రీద్‌ను రాష్ట్ర ప్రజలందరు ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ పండుగ త్యాగానికి ప్రతీకగా, విశ్వాసానికి, భక్తికి, ప్రతిక అన్నారు. ఈ పండుగను ప్రతి ఇంట్లో శాంతి, ఆనందం మానవత్వం కలిగేలా చేయాలిని అల్లాను ప్రార్థించాలని కోరారు. అలాగే రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీబ్ హుస్సేన్ కూడా రాష్ట్ర ప్రజలకు మంత్రితో పాటు శుభాకాంక్షలు తెలిపారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు

వెలుగోడు: బక్రీద్ పండుగను పురస్కరించుకొని వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వెలుగోడులోని ఈద్గా మైదానంలో బక్రీద్ పండుగ రోజున ప్రార్థనలు చేసేందుకు మైదానంలో ఏర్పాట్లు చేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పీఎంశ్రీ స్కూళ్లలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను జూన్ 12వ తేదీలోపు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి సమగ్ర శిక్ష ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్‌లో పీఎంశ్రీ స్కూల్స్‌లో నిర్మిస్తున్న రసాయన ప్రయోగశాల, ప్లే గ్రౌండ్స్, కిచెన్‌గార్డెన్స్, లైబ్రరీలపై ఏఈలు, ప్రధానోపాధ్యాయులు, సెక్టోరియల్ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఏపీసీ ప్రేమంత్‌కుమార్, ఎస్ఎస్ఏ ఈఈ శ్రీనివాసులు, డీఈ నాగభూషణంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీ నిర్వహిస్తున్న జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగులు సద్విని యోగం చేసుకోవాలని కలెక్టర్ రాజకుమారి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. వివరాలకు 7673902328, 9154830286,నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్‌స్టార్స్ అవార్డులతో అభినందిం చే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9న కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 120మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 35మంది విద్యార్థులకు సమాచారం అందించాలని కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి విజయవంతం చేయాలని ఆదేశించారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి

మిడుతూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం మిడుతూరు మండలాన్ని భారత్ సిందూర్‌గా తీర్చిదిద్ది నిద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి కోరారు. శుక్రవారం స్థానిక బన్నూరు నాగిరెడ్డి నివాసంలో లబ్బి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మిడుతూరు మండలంలోని నాగలూటి, పైపాలెం, కడుమూరు, మాసపేట గ్రామాల పరిధిలో ఉన్న సుమారు 4 వేల ఎకరాల భూములను బడా కంపెనీలకు ధారాదత్తం చేయకుండా ఆ ప్రాంతాన్ని పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేసి అర్హత కలిగిన నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కలమందలపాడు చెరువును హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా ఒక టీఎంసీ నీటిని నింపి మండలంలోని 20 వేల ఎకరాలకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఎంపీటీసీ హరిసర్వోత్తమ రెడ్డి, సర్పంచులు జీవరత్నం, వెంకటేశ్వర్లు, బక్కన్న, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ముస్లింలకు మంత్రి బక్రీద్ శుభాకాంక్షలు



బనగానపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలకు రాష్ట్ర రోడ్ల, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి శుక్రవారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్‌ను జరుపుకుంటారన్నారు. త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలని పేర్కొన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ముస్లింలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

చాగలమర్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు తెలిపారు. 'పారిశ్రద్ధ ఏది?' అన్న శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. అనంతరం ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న డ్రైనేజీని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ డ్రైడే పాటించాలని అన్నారు. అనంతరం కొత్త ఎస్సీ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఏఎంవో విజయ్, ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, వైద్యులు అంజలి, హెచ్ఈ వెంకటమ్మ, హెచ్ఎస్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు మనోహర్, గార్లెట్, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కిషోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కిషోర బాలికలు ఆరోగ్యంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి స్వప్న ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం చాగలమర్రిలోని కొత్త ఎస్సీ కాలనీలో కిషోరి వికాసం కార్యక్రమం కింద 15 నుంచి 18 సంవత్సరాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జూన్ 10 వరకు కిషోరి వికాసం కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, సీహెచ్‌వో సురేష్‌బాబు, మహిళా పోలీసు ప్రసన్న, ఏఎన్ఎం గార్లెట్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

డ్రోన్లతో ప్రత్యేక నిఘా

డోన్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు పరిసరాలను పరిశీలించేందుకు డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. డీఎస్పీ కార్యాలయంలో పైభాగం మొదటి ఫ్లోర్‌లో నూతన భవనాన్ని ఏర్పాటు చేసి పట్టణంపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు అనుసంధానం చేస్తూ ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రత దృష్ట్యా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఏడు ఫ్లోర్లలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. వీటి ప్రారంభోత్సవాలకు శనివారం రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా హాజరవుతున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణంలో వేద పండితులు, భక్తులు

ఆళ్లగడ్డ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలం లోని దేవరాయపురం గ్రామంలో సీతారామ, లక్ష్మణ హనమత్ సమేత గణపతి ధ్వజ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు సంజీవ రాయుడు, కార్యనిర్వాహక సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి'

కొలిమిగుండ్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దవెంతుర్ల గ్రామంలో దళిత కాలనీలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కూల్చి కాలనీని ఆక్రమించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీస్ నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దవెంతుర్ల దళిత కాలనీని ఎమ్మార్పీస్ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 25ఏళ్ల క్రితం గ్రామ రెవెన్యూ పరిధిలోని 218 సర్వేనెంబర్లో ప్రభుత్వం 30మంది దళితులకు ఇళ్లు నిర్మించి ఇచ్చిందన్నారు. అయితే ఇటీవల ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో నివాసం ఉండటం లేదని అన్నారు. ఇదే అదనుగా భావించిన ఓ అక్రమార్కుడు పక్కనే ఉన్న తన పొలంలో కాలనీని కలుపుకోవాలని ఇళ్లను నేలమట్టం చేసినట్లు వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. స్థానికులు బాలనరసింహులు, కంబన్న, ఓబులేషు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నీరు పారేదెలా?

- పూడికపోయిన తెలుగు గంగ ఉప కాలువలు
- నీరు విడుదల చేయకముందే తొలగించాలని వేడుకోలు

రుద్రవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తెలుగుగంగ ఉప కాల్వల్లో పూడిక పేరుకుపోయింది. దాంతో నీరు ముందుకు పారడం లేదు. మండలంలోని 16వ గంగ బ్లాక్‌ఛానెల్ కింద ఉప కాల్వల నుంచి 17 , 18, 19 , 20, 21, 22, 23, 25 వరకు బ్లాక్‌ఛానెళ్ల కింద ఉపకాల్వలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. గంగ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు పారే టైంలో అడ్డంకిగా మారి గట్లు తెగిపోయి నీరు పంట పొలాల్లో ప్రవహించడం వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకుని ఉప కాల్వల్లో చెత్త పూడికను తొలగించి నీటి పారుదలకు సౌకర్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దక్షిణ కొట్టాలు సమీపంలో తెలుగుగంగ ఉప కాల్వ ఇలా..



అప్పనపల్లె సమీపంలో తెలుగుగంగ ఉప కాల్వలో పెరిగిన పిచ్చిమొక్కలు

పిచ్చిమొక్కలతో నిండిన ఉపకాల్వ



గంగ ఉప కాలవల్లో పూడిక, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. సాగునీరు విడుదల చేయకముందే పూడికను తొలగించాలి.

● జమాల్‌సాహెబ్, రైతు, కొండమాయపల్లె

నిర్లక్ష్యంగా వదిలేశారు



కాల్వలను నిర్లక్ష్యంగా వదిలేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ప్రతి యేటా కాల్వ గట్లకు గండ్లు పడుతున్నాయి. అధికారులు స్పందించి కాలువలో పేరుకపోయిన చెత్తను తొలగించాలి.

● నరసింహులు, రైతు, పెద్దకంబలూరు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
- డోన్ ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని డోన్ ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించారు. వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో సెల్‌టవర్ సమస్య, అవసరమైన ఆపరేషన్ పరికరాలు, శుభ్రత తదితర అంశాలపై ఎమ్మెల్యే మాట్లాడారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను సకాలంలో సరి చేయాలని సంబంధిత వైద్యాధికారులకు ఆయన సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి పనులకు ప్రభుత్వ నిధులు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్డీవో నరసింహులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, కమిషనర్ ప్రసాద్‌గౌడు, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, ఓంప్రకాష్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి జన్మదినం సందర్భంగా డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అర్జున్ రెడ్డి అభిమానులు, యూత్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొని రోగులకు భోజనాలు వడ్డించారు.

పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలి

- దీక్షా శిబిరంలో కార్మికులు
- సంఘీభావం ప్రకటించిన టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న ఫ్యాక్టరీ కార్మికుడు మోజెస్

బేతంచెర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని కార్మికులు వేడుకున్నారు. యాజమాన్యంతో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కుమ్మక్కు అయి ఏడాది నుంచి ఫ్యాక్టరీని మూసివేయడంతో బతుకులు రోడ్డుపై పడ్డాయని వాపోయారు. ఐదు రోజులుగా శాంతియుతంగా కార్మికులు దీక్షలు చేపట్టినా యాజమాన్యం పట్టించుకోకపోవడం బాధాకర మన్నారు. శుక్రవారం బేతంచెర్ల టీడీపీ మండల నాయకులు కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావాన్ని తెలిపారు. ఈ సం దర్భంగా కార్మికుడు మోజెస్ మాట్లాడుతూ మూతపడిన పాణ్యం సిమెం టు ఫ్యాక్టరీ నిర్వహణ మాజీ మంత్రి బుగ్గన, పదవి విరమణ పొందిన డీఎస్పీ నరసింహారెడ్డి కనుసైగల్లో నడుస్తుందన్నారు. ఏడాది నుంచి ఫ్యాక్టరీ మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్మికులను వైసీపీ, టీడీపీ వారిగా విభజించడం శోచనీయమన్నారు. పలువురిని విధుల్లోకి తీసుకొని టీడీపీ చెందిన వారని 13 మంది విధుల్లోకి తీసుకోలేదన్నారు. యాజమాన్యం కూడా బుగ్గన చెప్పినట్లే నడుస్తున్నారన్నారు. ఫ్యాక్టరీని పునఃప్రారంభించి కార్మికులను ఆదుకోకపోతే తాము ఆమరణ నిరాహారదీక్షకు వెనుకాడబోమని హెచ్చరించారు. రామసుబ్బయ్య మాట్లాడుతూ సిమెంటు ఫ్యాక్టరీకి ఒక అంగడిగా భావించి మాట్లాడడం దారుణమన్నారు. టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య మాట్లాడుతూ సిమెంటునగర్‌లో ఫ్యాక్టరనీ నమ్ముకుని కార్మికులు ఉన్నారన్నారు. టీడీపీ సీనియర్ నాయకురాలు ఫ్యాక్టరీ యాజమాన్యాలు కార్మికులను ఆదుకోవాలన్నారు. టీడీపీ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, జాకీరుల్లా బేగ్, అంబాపురం సర్పంచ్‌శ్రీనివాస్ యాదవ్, రాముడు, ఉరుకుంద, వాసు, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ జూన్ 6(ఆంధ్రజ్యోతి): తప్పు చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ తప్పు జరిగినా తనపై ఆపాదించడం కొంత మందికి పరిపాటిగా మారిందన్నారు. దొర్నిపాడు మండలంలో రెండు రోజుల కిందట జరిగిన ఘటన టీడీపీకి ఎలాంటి సంబంధం లేదని, కేవలం ఆయా కుటుంబాల వ్యక్తిగత విషయమని స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితులు ఎవరైన సరే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిఎస్పీని కోరామన్నారు. ఇప్పటికే నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారని, మిగిలిన వారిని కూడా అరెస్టు చేస్తారన్నారు. వైసీపీ నాయకులు ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం పేరట చేసిన కార్యక్రమాలు ఎందుకు చేసారో అర్థం కావడం లేదన్నారు. ఎవరు ఎవరికి వెన్ను పోటు పొడిచారో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఈ వెన్ను పోట్లును చూసి తట్టుకోలేక ప్రజలు సరైన బుద్ధి చెప్పి కూటమి ప్రభుత్వానికి అఖండ మెజార్టీ కట్టబెట్టారని తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

డోన్ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 10నుంచి 20వ తేదీ వరకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 24న పాఠశాలలో పరీక్షలు ఉంటాయని, 25న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. 26న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారాలను స్థానిక పాఠశాలలో ఇవ్వాలన్నారు.

నేడు బక్రీద్ పండుగ

చాగలమర్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో బక్రీద్ పండుగ సందర్భంగా చాగలమర్రి అడ్డవాగు సమీపంలోగల ఈద్గాను ముస్తాబు చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఖాజీ యూనస్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు పలు సౌకర్యాలు కల్పించారు. చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. పారిశుధ్య సిబ్బందిచే పరిసరాలను శుభ్రం చేయించారు. ఎస్ఐ సురేష్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటుకు సిద్ధం చేశారు.

దేవాలయ భూములకు కౌలు వేలం

రుద్రవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి, నాగేశ్వరస్వామి దేవాలయ భూములకు శుక్రవారం కౌలు వేలం ఈవో నరసయ్య నిర్వహించారు. వేలంలో రూ.2లక్షలు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఆదాయాన్ని దేవాలయ ఖాతాలో జమ చేస్తామన్నారు. అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమోహన్, లక్ష్మిరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

10న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

చాగలమర్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 10న దూదెకుల సంఘం ఆధ్వర్యంలో చాగలమర్రి గ్రామంలోని చైతన్యభారతి పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆ సంఘ అధ్యక్షుడు లాలయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య శుక్రవారం తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన దూదెకుల కులస్థుల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోశాధికారి నాగశేషు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చర్చి వార్షికోత్సవం

రుద్రవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో శనివారం పేతురు సీఎస్ఐ చర్చి 20వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. అలాగే 8వ తేదీన బండలాగుడు పోటీలు నిర్వహిస్తారని, ఆరుబండ్ల విభాగంలో ఈపోటీలు కొనసాగుతాయ న్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40వేలు , 30వేలు, 20వేలు, 10వేలు, 5వేలు , 3వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గాడిదల, ట్రాక్టరు రివర్స్ బైకు స్లో పోటీలు సైతం నిర్వహిస్తారని తెలిపారు.

నాపరాతి గనిలో మోటార్ల చోరీ

కొలిమిగుండ్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో సింగిరి రాజారెడ్డికి సంబంధించిన నాపరాతి గనిలో చోరీ జరిగినట్లు బాధితుడు కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదుచేశారు. గనిలో విద్యుత్ మోటారు, కాపర్ వైరు, ఇతర సామగ్రిని గుర్తు తెలియని దుండుగలు ఎత్తుకెళ్లినట్లు వాపోయాడు. వీటి విలువ రూ.1.20లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

శిరివెళ్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. శిరివెళ్లలోని గ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు పంపిణీ చేశామన్నారు. విశ్రాంత హెచ్ఎం రామకృష్ణ, పోస్ట్ మాస్టర్ అఖిల, పోస్ట్‌మాన్ ఖాజా హుసేన్, పాఠకులు పాల్గొన్నారు.

వాసవీమాతకు విశేష పూజలు

చాగలమర్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు విశేష పూజలు వేద పండితుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, గణపతిహోమం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీర్చి పల్లకి ఉత్సవం చేశారు. లక్ష్మీనారాయణ, లక్ష్మణబాబు, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

కొలిమిగుండ్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలు(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.సంజీవరెడ్డి వెల్లడించారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ఎస్.ఆఫ్రీద్, మనీషా, బి.వసంత లక్ష్మి, జస్మిత, పి.ఆఫ్రీద్ సాల్కర్‌షిప్‌లకు స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ ప్రశంసించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

చాగలమర్రి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేసే కూలీల మస్టర్లలో ఎఫ్ఏలు, టీఏలు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏపీవో ఖాసీం సాహెబ్ హెచ్చరించారు. శుక్రవారం డి.వనిపెంట గ్రామంలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న కూలీల మస్టర్లను పరి శీలించారు. పనికి వచ్చే కూలీల పేర్లను మాత్రమే నమోదు చే యాలని అన్నారు. పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహిం చాలని అన్నారు. ఆయన వెంట టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



పల్లకీ సేవలో చౌడేశ్వరీమాత

బనగానపల్లె, జూన్6 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో శుక్రవారం మాత పల్లకీసేవ నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకిలో అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకి సేవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

తలనీలాల సేకరణకు వేలం

బనగానపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో తలనీలాల వేలాన్ని నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కామేశ్వరమ్మ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ వేలంలో తలనీలాలు పోగు చేసుకొనే హక్కును ఎం.పుల్లయ్య రూ.5.20లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డుపై యువకుడి వీరంగం



రోడ్డుపై బస్సు కింద పడుకొన్న యువకుడు

ఆళ్లగడ్డ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై శుక్రవారం మద్యం తాగి ఒక యువకుడు వీరంగం సృష్టించాడు. దీంతో గంటకు పైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో నంద్యాలకు వెళ్లేందుకు మద్యం తాగిన ఓయువకుడు ఎక్కి ఇతరుకు ఇబ్బందికరంగా ప్రవర్తించాడు. అతడ్ని కండక్టర్ కిందికి దించేశారు. దీంతో ఆ యువకుడు బస్సు ముందు వీరంగం సృష్టిస్తూ చక్రం కింద పడుకొని ఎంతకూ లేవకపోవడంతో అక్కడున్న వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి సిబ్బందితో అక్కడి చేరుకొని మద్యం తాగిన యువకుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అన్ని మతాల వారు మతసామరస్యాన్ని పాటించి పట్టణంలో శాంతి భద్రతలు కాపాడడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు ముజావర్‌బాష, బురానుద్దీన్, డాక్టర్ మహమ్మద్‌హుసేన్, అల్లా బకాస్, మాహబూబ్‌వలి, సలాం, అల్తాఫ్‌హుసేని, గౌస్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: బక్రీద్ పండుగను ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు కోరారు. శుక్రవారం ప్రాంతీయ పశువైద్యశాల సమావేశం మందిరంలో ముస్లిం మత పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు మౌలానా మహ్మద్ బాషా, మౌలానా దర్వేష్ ఖాన్, మౌలానా రియాజ్, సాహేబ్, మౌలానా ఇలియాజ్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది మహ్మద్ రఫీ, ఎల్ఎస్ఏ నవ్య పాల్గొన్నారు.

చికెన్ దుకాణాల్లో తనిఖీలు

- అధికారులతో వాగ్వాదం



ఎస్ఆర్ చికెన్ సెంటర్ వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు చికెన్ దుకాణాలను మున్సిపల్, పశుసంవర్ధక శాఖాధికారులు తనిఖీలు చేశారు. శుక్రవారం ఎఎస్ఆర్ చికెన్ సెంటర్‌లో శాంపిల్స్‌ను తీసుకునేందుకు అధికారులు ప్రయత్నించారు. దుకాణ యజమాని నిరాకరించాడు. దీంతో అధికారులు, దుకాణ యజమాని మధ్య వాగ్వాదం జరిగింది. అతడికి చెందిన వారు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. చేసేదేమీ లేక అధికారులు అక్కడి నుంచి వచ్చేశారు. కమీషన్ల కోసం మున్సిపల్ కమిషనర్ కక్కుర్తి పడుతున్నారని, కేజీకి రూ.5 కమిషన్ ఇవ్వాలని వేధిస్తున్నాడని ఏఎస్ఆర్ చికెన్ సెంటర్ యజమాని మహబుబ్‌బాష ఆరోపించారు.

చికెన్ దుకాణదారులకు నోటీసులు

చాగలమర్రి: స్థానిక ఏడు చికెన్ దుకాణదారులకు శుక్రవారం నోటీసులు అందజేసినట్లు మేజర్ పంచాయతీ ఈవో తాహిర్‌హుసేన్ తెలిపారు. చికెన్ దుకాణాల్లో చనిపోయిన కోళ్ల మాంసం విక్రయిస్తున్నారని, దీంతో ప్రజలకు అనారోగాల బారినపడుతున్నట్లు తమకు ఫిర్యాదు చేశారన్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు ఏడు చికెన్ దుకాణాలకు నోటీసులిచ్చామన్నారు.